
జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 171 7-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## ఆలయానికి కొత్తగా సీఈఓ



- చందా చోరీ ఉదంతంతో మసకబారిన అయోధ్య రామమందిర ప్రతిష్టను పునరుద్ధరించేందుకు చర్య
- ముగ్గురు సభ్యుల కమిటీకి సీఈఓ ఎంపిక బాధ్యతలు
- చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం
- తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్ నియామకం
- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక భేటీలో నిర్ణయాలు

2లో



## లంక జైల్లో గ్యాంగ్ వార్

26 మంది మృతి! మత్తుమందుల వ్యవహారమే కారణం?

పోలీసుల తుపాకులు లాక్కొన్న ఖైదీలు

2లో

## యుద్ధవిమానాలు తోడ్కొని రాగా..

ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ఇండోనేసియా అధ్యక్షుడు సుబియంతో

ఇండోనేసియా గగనతలంలో ప్రధాని మోదీకి అరుదైన గౌరవం

ఎయిర్‌పోర్ట్‌లో సాదర స్వాగతం పలికిన ఆ దేశాధ్యక్షుడు సుబియంతో



## విశాఖలో 'బే సిటీ'..

# అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు

- విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సమీక్ష
- ఏపీ సమగ్రాభివృద్ధికి త్రైపాక్షిక వ్యూహం
- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళిక
- 6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఆదేశం
- మూడు రీజియన్లలో ప్రైవేట్ భాగస్వామ్యంతో స్పోర్ట్స్ సిటీల ఏర్పాటు
- 51.88 చ.కి.మీ. విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధికి కార్యాచరణ



రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఏర్పాటు చేసిన మూడు ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సోమవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉద్యాన పంటలతో కడప జిల్లా లింగాల మండలం సాధించిన అద్భుత ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని, మొత్తం రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రాంతాలను

- మిగతా 2వ పేజీలో



## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ..

- పర్యాటక రంగంపై సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష
- తెలంగాణను అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం
- తారామతి బారాదరి, దుర్గం చెరువు అభివృద్ధికి ఆదేశాలు
- వికారాబాద్, వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధిపై దృష్టి
- మరిన్ని ఎకో పార్కులు, ఫ్యూచర్ సిటీలో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులు
- పురానాపూల్‌ను పర్యాటక కేంద్రంగా మార్చే ప్రతిపాదన

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ దిశగా ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. తారామతి బారాదరిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును


- మిగతా 2వ పేజీలో



## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

- బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు
- భగీరథ్‌కు బెయిల్ ఇవ్వొద్దని బాధితురాలి తరపు న్యాయవాది వాదన
- సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వివరణ
- బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా అభియోగాలను సవరించినట్లు పోలీసుల వెల్లడి
- నిందితుడు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని ప్రాసిక్యూషన్ వాదన

2లో



## ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలు..

- ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మంత్రి
- రతన్ టాటా హబ్ ద్వారా కొరియన్ స్టార్టప్‌లకు ఏపీకి ఆహ్వానం
- భారత ఏఐ రాజధానిగా ఏపీని తీర్చిదిద్దడమే ధ్యేయమని వెల్లడి
- అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటం-ఏఐ విశ్వవిద్యాలయం
- శ్రీసిటీలో విద్యుత్ పరికరాల యూనిట్ పెట్టాలని హ్యోసంగ్‌కు విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్‌కు భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఏపీని ఆవిష్కరణలు, తయారీ రంగంలో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ఆయన కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో రాబోయే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లను ప్రోత్సహించి, తద్వారా లక్ష ఉద్యోగాలు సృష్టించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని లోకేశ్ స్పష్టం చేశారు. సియోల్ బిజినెస్

- మిగతా 2వ పేజీలో

## కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి మౌనం ఎందుకు

- కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు ఆడుతున్నాయన్న రాంచందర్ రావు
- జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టలేదని విమర్శ
- హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని మండిపాటు

2లో





2లో

## రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు

- కక్ష సాధింపులకు పోలీసులను ప్రభుత్వం వాడుకుంటోందన్న అంబటి
- సాధారణ యూట్యూబర్ రావణ్‌పై దేశద్రోహం చట్టాలను ప్రయోగించారని మండిపాటు
- రావణ్‌కు న్యాయ సహాయం అందిస్తామని వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటూ ప్రతిపక్షాలే లక్ష్యంగా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## యుద్ధవిమానాలు తోడ్కొని రాగా..

జకార్తా: భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇండోనేసియా ప్రభుత్వం అరుదైన గౌరవం కల్పించింది. మిత్రదేశ సారథికి సాదర స్వాగతం పలికేందుకు అత్యంత అధునాతన యుద్ధవిమానాలను ఎదుర్కోలుకు పంపింది. సోమవారం ఢిల్లీ నుంచి బయల్దేరిన మోదీ విమానం ఇండోనేసియా గగనతలంలోకి రాగానే ఆ దేశానికి చెందిన ఎఫ్--16, సుఖోయ్--30 యుద్ధవిమానాలు ఎదురొచ్చి మరీ సాదరంగా జకార్తా అంతర్జాతీయ విమానాశ్రయానికి దారిచూపించాయి. ఫైటర్‌జెట్‌లు ఎస్కార్ట్‌గా వెంట రావడంపై ప్రధాని మోదీ సంతోషం వ్యక్తంచేస్తూ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. మొదలు ఎయిర్‌పోర్ట్ దాకా ఇండోనేసియా ప్రభుత్వం చేసిన సాదర స్వాగత కార్యక్రమం తన మనసును హత్తుకుందని మోదీ వ్యాఖ్యానించారు. ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే ప్రధాని మోదీకి ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోబో సుబియంతో సాదరస్వాగతం పలికారు. నలుగురు మంత్రులతో కలిసి వచి?చమరీ ఆయన ప్రధానిని ఆప్యాయంగా హత్తుకుని కుశల ప్రశ్నలువేశారు. మంగళవారం సుబియంతో, మోదీ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం పటిష్టతే లక్ష్యంగా కీలక రంగాల్లో సహకారం, వాణిజ్యంపై ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇరుదేశాల బంధాన్ని 2018లో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి ఉన్నతీకరించాక మోదీ ఇక్కడకు రావడం ఇదే తొలిసారి. "మంగళవారం సుబియంతోతో కలిసి యోగ్యకర్త నగరంలోని దేశంలోనే అతిపెద్ద హిందూ దేవాలయం ప్రభానన్‌ను దర్శించుకుంటా. ఇది ఇరుదేశాల సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబించనుంది. భారతీయులతోనూ మాట్లాడబోతున్నా. విదేశంలో భారతీయులు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉంది. విదేశంలో ఉంటూ భారత ప్రగతికి వీళ్లంతా కృషిచేయడం ఎంతో స్ఫూర్తిదాయకం. భారతీయ సంగతి తమ ఘన విజయాల ద్వారా భారత బంధాన్ని ప్రపంచ దేశాలతో బలపరుస్తున్నారు"అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## లంక జైల్లో గ్యాంగ్ వార్

కొలంబో (శ్రీలంక): శ్రీలంకలోని నెగొంబో జైల్లో ఆదివారం మొదలైన గ్యాంగ్ వార్ 26 మంది ప్రాణాలు తీసింది. వందమంది గాయపడ్డారు. మృతుల్లో శిక్ష అనుభవిస్తున్న నేరగాళ్లతోపాటు జైలు గార్డులు కూడా ఉన్నట్లు అధికారులు సోమవారం తెలిపారు. నేరగాళ్ల గుంపులు మొదట ఆదివారం ఒకరితో ఒకరు తలపడటంతో ఈ గ్యాంగ్ వార్ మొదలైంది. అయితే సోమవారం వీరు జైల్లోని తుపాకులు కూడా లాక్కోవడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. అచ్చం సినిమాల్లో చూపినట్టుగానే మత్తుమందుల రవాణాకు సంబంధించి రెండు వైరి గ్రూపుల మధ్య వివాదంతో ఘర్షణ మొదలైనట్లు ప్రాథమిక విచారణ ద్వారా తెలిసింది. ఒక వర్గం మత్తుమందుల రవాణాకు పాల్పడతూండగా ఇంకో వర్గం దాన్ని వ్యతిరేకించింది. వర్గం సమాచారం ప్రత్యర్థి వర్గానికి ఎవరు అందించారన్న విషయమై ఘర్షణ మొదలైనట్లు తెలిసింది. ఆదివారం రెండు వర్గాల వారు కలబడటంతో 20మంది వరకూ మరణించారు. ఆ తరువాత కొందరు మహిళ ఖైదీలు ఆదివారం రాత్రి జైలు పైకప్పుపై నిరసన ప్రదర్శన నిర్వహిస్తూండగా అది పాక్షికంగా కూలిపోయింది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు కొన్ని ప్రయత్నాలు చేసినా అవి పెద్దగా ఫలించలేదు. ఈ నేపథ్యంలో సోమవారం కూడా జైల్లో ఆందోళనకర పరిస్థితులు కొనసాగాయి. తొలి రోజు ఘటనలకు వ్యతిరేకంగా నిరసనలకు దిగిన ఖైదీలు జైలు ఆయుధాగారంలోకి చొరబడి తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. కాల్పులు జరిపారు. ఫలితంగా నలుగురు గార్డులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు నెగొంబో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లుగా తెలుస్తోంది.

## రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు

ధ్వజమెత్తారు. వైసీపీ నేతలతో పాటు సోషల్ మీడియా యాక్టివిస్టులు, రాజకీయ విశ్లేషకులను భయభ్రాంతులకు గురిచేసేందుకే అక్రమ కేసులు, అరెస్టుల పర్వానికి తెరలేపారని ఆయన మండిపడ్డారు. వివాదాస్పద యూట్యూబర్ రావణ్ (జోసెఫ్), కేవీఆర్ వంటి వారికి తమ వైసీపీతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు లేవని అంబటి స్పష్టం చేశారు. అయినప్పటికీ ఒక సాధారణ యూట్యూబర్‌పై దేశద్రోహం, 'ఉపా' వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమన్నారు. చట్ట పరిధి దాటి ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవచ్చు కానీ, దారుణమైన సెక్షన్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. రావణ్‌ను శారీరకంగా అంతమొందించే ప్రయత్నాలు కూడా జరిగాయని అంబటి సంచలన ఆరోపణ చేశారు. ఈ కేసులో పిఠాపురం కోర్టుతో పాటు పలు న్యాయస్థానాలు రావణ్‌కు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకోవడం లేదన్నారు. రావణ్ తమ పార్టీ వ్యక్తి కాకపోయినప్పటికీ, బాధితుడిగా అతనికి వైసీపీ తరఫున అవసరమైన పూర్తి న్యాయ సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు. కేవీఆర్ అరెస్టు వ్యవహారంలో ఏపీ పోలీసులు కనీస చట్టపరమైన నిబంధనలు పాటించలేదని... అందుకే దౌర్జన్యంగా ప్రవర్తించిన ఏపీ పోలీసులపై ఏకంగా తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సోషల్ మీడియాపై అధికారిక దౌర్జన్యకాండ సాగుతోందని అంబటి విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే కొందరు వ్యక్తులు అత్యంత అసభ్య పదజాలంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నా... వారిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, చట్టం అందరికీ ఒకేలా ఎందుకు వర్తించడం లేదని నిలదీశారు.

## కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు

జనసంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తదితర నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. దేశ సమైక్యత కోసం ముఖర్జీ చేసిన త్యాగాలు మరువలేనివని ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆ అవినీతిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. మరోవైపు హైడ్రా కూల్చివేతల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని... ఎంఐఎం నేతలకు చెందిన ఫాతిమా విద్యాసంస్థల అక్రమ కట్టడాలపై కోర్టులు తప్పుబట్టినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్-ఎంఐఎం దోస్తీ వల్లే ఈ పక్షపాతమని... హైడ్రా అందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని, లేనిపక్షంలో విపక్షాల అక్రమాలపై రాష్ట్రవ్యాప్త పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

# విశాఖలో 'బే సిటీ'.. అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు

తలదన్నేలా, లింగాల మండలంలో ప్రజల తలసరి ఆదాయం రూ. 7.30 లక్షలుగా ఉండటం ఉద్యాన పంటల సత్తాకు నిదర్శనమని సీఎం అన్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (టీఈఆర్) అభివృద్ధికి హార్టికల్చర్ ఒక గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందని, ఈ ప్రాంతంలో 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలని ఆదేశించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఇప్పటికే ఆవిష్కరించగా, రాబోయే ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్లకు కూడా మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ ముసాయిదా ప్రణాళికలను ప్రజలు, ప్రజాప్రతినిధుల ముందు ఉంచి, వారి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే తుదిరూపు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి జిల్లాకు రెండు నెలల్లోగా 'డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్' రూపొందించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఉన్న వనరులు, అవకాశాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో 51.88 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ'ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్-ఇన్నోవేషన్, గ్లోబల్ టాలెంట్-ఎలైట్ లివింగ్ అనే మూడు మూలస్తంభాలపై ఈ నగరాన్ని నిర్మించాలని సూచించారు. ఇక్కడ 3,291 ఎకరాల



ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. రాబోయే మూడు నెలల్లో విశాఖలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. అరకు-పాడేరు-విశాఖను ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని, సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన నగరాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సిటీలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. రాష్ట్ర జనాభాలో 32 శాతం, భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉన్న అమరావతి ఎకనామిక్ రీజియన్ (ఏఈఆర్) అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. మొత్తం 9 జిల్లాల పరిధిలోని ఈ రీజియన్‌లో ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు కొల్లేరు సరస్సును అభివృద్ధికి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. మరోవైపు, విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీపడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఖనిజ సంపద, పుణ్యక్షేత్రాలు, విద్యాసంస్థలు, పర్యాటక ప్రాంతాలతో టీఈఆర్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయన్నారు. శ్రీసిటీ, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, పునరుత్పాదక ఇంధనం, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఈ ప్రాంతం స్వర్గధామం కావాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో టీఈఆర్ వాటాను 0.90 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మూడు రీజియన్ల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్, యువరాజ్ పాల్గొన్నారు.

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

పోక్సో కేసులో అరెస్టైన బండి భగీరథ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని బాధితురాలి తరపు న్యాయవాది కోర్టును కోరారు. నిందితుడి తండ్రి కేంద్ర మంత్రి కావడంతో కేసుపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు బెయిల్ ఇవ్వొద్దని వాదించారు. ఇంకా పలువురు సాక్షులను విచారించాల్సి ఉందని తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరైతే వారిపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. భగీరథ్ జైలులో ఉంటేనే దర్యాప్తు పారదర్శకంగా సాగుతుందని పేర్కొన్నారు. మరోవైపు పేట్‌బషీరాబాద్ పోలీసులు దాఖలు చేసిన కౌంటర్‌లో కీలక అంశాలను ప్రస్తావించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసిన తర్వాత ఆరోపణల తీవ్రత దృష్ట్యా అభియోగాలను సవరించినట్లు కోర్టుకు వెల్లడించారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం నిందితుడు స్నేహం పేరుతో పరిచయం పెంచుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు.

## ఆలయానికి కొత్తగా సీఈఓ

అయోధ్య: రామమందిర ఉద్యమాన్ని ముందుండి నడిపించిన బీజేపీ, సంఘ్ పరివార్‌లు అయోధ్య రామమందిరంలో కోట్ల రూపాయల చందా చోరీ ఉదంతంతో మసకబారిన ఆలయ ప్రతిష్ట పునరుద్ధరించేందుకు నడుంబిగించాయి. ఆలయ నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా కొత్తగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ) పదవిని ఏర్పాటుచేయాలని సోమవారం జరిగిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక భేటీలో నిర్ణయించారు. సీఈఓ పదవికి అర్హతలున్న వ్యక్తి ఎంపిక బాధ్యతలను ముగ్గురు సభ్యుల కమిటీకి అప్పగించారు. ఈ కమిటీలోకి సభ్యులుగా విశ్రాంత న్యాయమూర్తి ప్రమోద్ కోహ్లీ, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేది, ట్రస్టీ సురేశ్ హవారేలను తీసుకున్నారు. లక్షలాది మంది భక్తులు సమరి?పంచిన నగదు, స్వర్ణాభరణ కానుకలను కాజేసిన ఉదంతంలో నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామాచేస్తూ చంపత్ రాయ్ తీసుకున్న నిర్ణయాన్ని సోమవారం ఆలయ కాంప్లెక్స్‌లోని గెస్ట్‌హౌస్‌లో మధ్యాహ్నం మూడుగంటలపాటు జరిగిన భేటీలో ట్రస్ట్ సభ్యులు ఆమోదించారు. ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామానూ ఆమోదించారు. ప్రస్తుతం ట్రస్టీగా ఉన్న కృష్ణమోహన్‌ను తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సమావేశంలో సభ్యులు నిర్ణయం తీసుకున్నారు.

**ఎవరైనా వచ్చి సరిచూసుకోవచ్చు: కృష్ణమోహన్**

భేటీ తర్వాత తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్ మీడియాతో మాట్లాడారు. "రామమందిరానికి భారీ స్థాయిలో బంగారం, వెండి, ఇతరత్రా అత్యంత విలువైన ఆభరణాలు, వస్తుసామగ్రిని ఇచ్చిన దాతలు తామిచ్చిన విరాళాలు ఉన్నాయో లేదో సరిచూసుకునేందుకు అవకాశం కల్పిస్తాం. నగదుకాని 2,926 కానుకల సంబంధ రికార్డులు, డాక్యుమెంట్లను బహిరంగంచేస్తాం. ఎవరైనా వచ్చి వాటిని సరిచూసుకోవచ్చు. చోరీకి పాల్పడిన వారికి తగిన శిక్ష పడేలా చేస్తాం. చోరీ ఘటనతో ఆలయంపై ఆరోపణల మచ్చ పడింది. ఇలాంటివి పునరావృతంకాకుండా, మళ్లీ ప్రజల విశ్వాసం చూరగొనేలా ట్రస్ట్ సభ్యులంతా ఎంతో పారదర్శకంగా పనిచేస్తారు. ఆలయాన్ని మరింత సమర్థవంతంగా, ఆదర్శప్రాయంగా నిర్వహించేందుకు, నిపుణుల నుంచి సలహాలు తీసుకోబోతున్నాం"అని తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్ అన్నారు. శతాబ్దాలపోరాట ఫలితంగా సాకారమైన ఆలయంలో కొంతకాలంగా హుండీల నుంచి విరాళాలు చోరీ అవుతున్నాయన్న విషయం తెలియగానే ట్రస్ట్ సభ్యులు, భక్తులు ఎంతో కలతచెందారని, ఇది నిజంగా చాలా ఇబ్బందికర పరిస్థితి అని ట్రస్ట్ కోశాధికారి గోవింద్‌దేవ్ గిరి వ్యాఖ్యానించారు. ఈనెల 22వ తేదీన ట్రస్ట్ మరోసారి సమావేశంకానుంది. సోమవారంనాటి భేటీలో ట్రస్ట్ చైర్మన్ నృత్యగోపాల్ దాస్‌సహా ఏడుగురు శాశ్వత సభ్యులు హాజరయ్యారు. సాయంత్రం ఆరున్నరదాకా భేటీ కొనసాగింది.

## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ..

పూర్తిస్థాయి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లను ఆధునికీకరించాలని చెప్పారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని, అక్కడి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి యాదాద్రి తరహాలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణహిత పర్యాటకానికి ప్రాధాన్యమిస్తూ 'క్యూర్' పరిధిలోని అటవీ భూములను 'ఎకో టూరిజం' కింద అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. పాతబస్తీలోని చారిత్రక పురానాపూల్ వంతెనను ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. అవసరమైతే అక్కడి ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చాలని అధికారులకు తెలిపారు.

# ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలు..

ఏజెన్సీ (ఎస్‌బీఏ) ఆధ్వర్యంలో కొరియన్ టెక్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.

**కొరియన్ స్టార్టప్‌లకు రెడ్ కార్పెట్**

ఏపీలో ఆవిష్కరణలకు వెన్నెముకగా ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) గురించి మంత్రి లోకేశ్ కొరియన్ పారిశ్రామికవేత్తలకు వివరించారు. అమరావతిని ప్రధాన కేంద్రంగా చేసుకుని విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం వంటి నగరాల్లో ప్రాంతీయ కేంద్రాలతో ఈ హబ్ పనిచేస్తోందని తెలిపారు. టాటా, ఎల్‌డటీ, జీఎంఆర్, అదానీ వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో దీనిని ప్రపంచ స్థాయి ఇన్నోవేషన్ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఆలోచనల రూపకల్పన (స్పార్క్), ఇంక్యుబేషన్ (క్యాటలిస్ట్) వంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కొరియన్ స్టార్టప్‌లను ఆయన ఆహ్వానించారు. ఇప్పటికే ఈ వేదిక ద్వారా 2,500కు పైగా స్టార్టప్‌లకు, 5,200 మందికి పైగా పారిశ్రామికవేత్తలకు మద్దతు అందించినట్లు గుర్తుచేశారు. ఏపీ ఇన్నోవేషన్ స్టార్టప్ పాలసీ 2024-29 కింద స్టార్టప్‌లకు అందిస్తున్న ఆర్థిక



ప్రోత్సాహకాలను లోకేశ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రూ. 22 కోట్ల ఆర్‌టీఐహెచ్-ఎస్ఐడీబీఐ సీడ్ ఫండ్, రూ. 20 కోట్ల వరకు ఏఐఎఫ్ సీడ్ ఈక్విటీ, వర్కింగ్ క్యాపిటల్ కోసం క్రెడిట్-గ్యారెంటీ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. సిడ్బీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన కొత్త డీప్-టెక్ ఏంజెల్ ఫండ్ ద్వారా ఏఐ, క్వాంటం వంటి అధునాతన రంగాల్లోని స్టార్టప్‌లకు మరింత ఊతమిస్తామని హామీ ఇచ్చారు. ఇండియా-కొరియా మధ్య ఒక ప్రత్యేక స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దామని, దీని కోసం ఆర్‌టీఐహెచ్‌లో ప్రత్యేకంగా కొరియా డెస్క్, సాఫ్ట్-ల్యాండింగ్ 'విసి బే' ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాజధానిగా నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. ఈ దిశగా ఇప్పటికే పలు చర్యలు ప్రారంభించామని తెలిపారు. గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు, రిలయన్స్, సిఫీ వంటి సంస్థల ద్వారా 10 గిగావాట్ల డేటా-సెంటర్ పైప్‌లైన్ నిర్మాణం జరుగుతోందని, దీనివల్ల స్టార్టప్‌లకు తక్కువ ధరకే భారీ కంప్యూటింగ్ వనరులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. దేశంలోనే మొట్టమొదటి క్వాంటం ఏఐ విశ్వవిద్యాలయాన్ని అమరావతి క్వాంటం వ్యాలీలో నెలకొల్పుతున్నట్లు ప్రకటించారు. దీని ద్వారా 133-క్యూబిట్ సామర్థ్యం గల ఐబీఎం క్వాంటం సిస్టమ్, క్వాంటం హార్డ్‌వేర్ పార్క్ అందుబాటులోకి వస్తాయని, ఇది కొరియన్ డీప్-టెక్ స్టార్టప్‌ల పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి అన్నారు.



## మానవత్వం చాటుకున్న సర్పంచ్ దంపతులు

- మృతుడు బాలరాజు కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన మూల బాలరాజు ఇటీవల అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ ఇండ్ల అనూష-సుమన్ దంపతులు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో కలిసి ఓదార్చడంతో పాటు బాలరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని, ప్రస్తుతం ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తక్షణ సహాయంగా 50 కిలోల నాణ్యమైన బియ్యాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామం తరఫున, వ్యక్తిగతంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ పరంగా లభించాల్సిన సంక్షేమ పథకాల ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చిగుర్ల గణేష్, మూల బాల్ నర్సయ్య, తమ్మడి కర్ణాకర్, మూల శ్రీనివాస్, ఎండి రహమాన్, మూల రాములు, మూల మల్లేశం, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## స్ఫూర్తిదాయకం జగ్జీవన్ రామ్ జీవితం

- నవభారత్ యూత్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం



**తొలివెలుగు, రాజాపేట:** స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడు, దళిత హక్కుల పరిరక్షకుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని నవభారత్ యూత్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. డాక్టర్ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరంలో విశేష పాత్ర పోషించిన జగ్జీవన్ రామ్, భారత రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం, దళితుల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. దేశ సమగ్రత, జాతి సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయన చేసిన సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. "సామాజిక సమానత్వం సాధించినప్పుడే స్వాతంత్ర్యానికి పరిపూర్ణ అర్థం చేకూరుతుంది" అనే జగ్జీవన్ రామ్ భావజాలం నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నవభారత్ యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

- ఘనంగా 40వ వర్ధంతి వేడుకలు
- హాజరైన ఆర్డీవో కృష్ణారెడ్డి, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్

**తొలివెలుగు, రాజాపేట/ భువనగిరి:** నవభారత నిర్మాణంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చేసిన త్యాగాలు, దేశానికి ఆయన చేసిన సేవలు మరవలేనివని ఎంఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఇంజ మహేష్ మాదిగ కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ 40వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. దేశ రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా బాబు జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు అద్వితీయమైనవన్నారు. ముఖ్యంగా దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన నిరంతరం శ్రమించారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్డీవో కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బర్రె జహంగీర్, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ, స్థానిక కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొని నివాళులర్పించారు.



# ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ: ఏసీపీ కృష్ణయ్య





- తట్టి అన్నారంలో 54 సీసీటీవీ కెమెరాల ప్రారంభం
- 'నేను సైతం 2.0'తో పటిష్టమైన నిఘా వ్యవస్థ

**తొలివెలుగు, ఎల్‌బీ నగర్/ నాగోల్ :** నేరాల నియంత్రణ, నేర పరిశోధనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అత్యంత కీలకమని ఎల్‌బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చేపడుతున్న "నేను సైతం 2.0" కార్యక్రమంలో భాగంగా నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన 54 సీసీటీవీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ.. సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణతో పాటు నేరస్థుల గుర్తింపు, నేరాల దర్యాప్తులో కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ నివాస ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్, వాణిజ్య సంస్థలు సీసీటీవీ నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్ గేటెడ్ కమ్యూనిటీలోని నాలుగు బ్లాకుల నివాసితులు తమ సొంత వ్యయంతో 54 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగోల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, ఎస్ఐ శివ నాగ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ దేవిడి వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ ఇన్‌చార్జ్‌లు రిజ్వాన్, భాస్కర్, దేవేందర్, మొహమ్మద్ ఖాతీజా బేగం, అపార్ట్‌మెంట్ నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటైజేషన్ వేగవంతం చేయాలి




- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 25 నుంచి ప్రారంభమైన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఫారాలను ఓటర్లు పూర్తి చేసిన అనంతరం వాటిని తిరిగి సేకరించి సంబంధిత బీఎల్‌ఓ యాప్‌లో డిజిటైజేషన్ చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో వాలంటీర్ల సహాయాన్ని వినియోగించి ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జూలై 20 నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణలో తప్పుడు సమాచారం సమర్పించిన ఓటర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బూత్ స్థాయి అధికారులకు సూపర్వైజర్లు, వాలంటీర్లు పూర్తి సహకారం అందించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, ప్రస్తుతం డిజిటైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌ను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లతో కార్యాచరణ ప్రకారం సమావేశాలు నిర్వహిస్తూ, జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు అదనపు కలెక్టర్ భాస్కరరావు ఆదేశం



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. మొత్తం 71 అర్జీలు అందగా, వాటిని సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అందిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు 45, సంక్షేమ శాఖకు 5, జిల్లా పరిషత్‌కు 4, గ్రామీణ అభివృద్ధి శాఖకు 3, సర్వే అండ్ ల్యాండ్స్‌కు 3, హౌసింగ్‌కు 2, అటవీ శాఖకు 2, పంచాయతీ శాఖకు 2, వ్యవసాయ, విద్య, ట్రాన్స్‌కో, కోఆపరేటివ్, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖలకు ఒక్కటి చొప్పున అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవనం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి





- అధికారులకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి :** భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెంలో నిర్మాణంలో ఉన్న అంబేద్కర్ భవనం పనులను నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మాణంలో ఉన్న అంబేద్కర్ భవనాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భవనం నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సమీక్షించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూనే నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే భవనానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై కూడా అధికారులతో చర్చించారు. భవనం ముందు సీసీ రోడ్డు నిర్మాణం, గ్రీనరీ అభివృద్ధి, పరిసరాల సుందరీకరణ తదితర పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అంబేద్కర్ భవనం ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా భక్తాంజనేయ-కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయ సప్తమ వార్షికోత్సవం

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ పాటిమీద భక్తాంజనేయ స్వామి దేవాలయం, శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణదాతలు సోమవారం సత్తయ్య-వెంకటమ్మ దంపతుల చేతుల మీదుగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు వైదిక సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, కౌన్సిలర్లు బత్తుల జయమ్మ దాస్, చింతల ఉమామేశ్వరి సాయిలు, దేవాలయ కమిటీ చైర్మన్ సందగళ్ల నాగరాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఊడుగు రమేష్ గౌడ్, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి

- సీపీఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు డిమాండ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను వెంటనే అమలు చేసి ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా, రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్న ఆయన, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ పోస్టులను వెంటనే భర్తీ చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని గంగాదేవి సైదులు హెచ్చరించారు.

## జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీకి సర్క్యులర్ ఇవ్వాలి

- నల్ల రిబ్బన్లతో టీయూడబ్ల్యూజే (ఐజేయు) నిరసన

**తొలివెలుగు, మునుగోడు:** జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించే సర్క్యులర్‌ను తక్షణమే జారీ చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయు) నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ముడుపు శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ పిలుపు మేరకు సోమవారం మునుగోడు మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కుంభం ఇంద్రసేనారెడ్డితో కలిసి మండల విద్యాధికారి తలమల్ల మల్లేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముడుపు శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ.. గత నెల 5న జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్‌కు జర్నలిస్టుల పిల్లలకు పాఠశాల ఫీజు రాయితీ కల్పించాలని వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సర్కులర్ జారీ కాకపోవడం బాధాకరమన్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విద్యాశాఖ స్పందించకపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లో ఇప్పటికే ఫీజు రాయితీకి సంబంధించిన సర్కులర్లు జారీ చేసిన నేపథ్యంలో, నల్గొండ జిల్లాలో కూడా వెంటనే సర్కులర్ జారీ చేసి పేద జర్నలిస్టు కుటుంబాల పిల్లలు విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జాజుల స్వామి, సహాయ కార్యదర్శి దొమ్మాటి కృష్ణ, జర్నలిస్టులు మార్నేని ప్రభాకర్, నెల్లికంటి శంకర్, బేరీ లింగస్వామి, పెరుమాళ్ల ప్రమోద్ కుమార్, దుబ్బ విజయభాస్కర్, జీడిమడ్ల నరేష్, దుబ్బ అనిల్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# వైభవంగా ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఛాంబర్ ప్రారంభం





- హాజరైన మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, శ్రీధర్ బాబు
- శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**తొలివెలుగు, హైదరాబాద్/రామన్నపేట:** ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అసెంబ్లీ ప్రాంగణంలోని తన నూతన "విప్ ఛాంబర్" ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. శాసనసభ భవనంలో కేటాయించిన ఈ కార్యాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సమాచార, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రభుత్వ విప్ వీరేశంకు పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని అభినందనలు తెలిపారు. వారితో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, నకిరేకల్ నియోజకవర్గం నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు వేముల వీరేశంను శాలువాలతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి, శాసనసభలో ప్రభుత్వ విప్ బాధ్యతల నిర్వహణకు ఈ ఛాంబర్ వేదికగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

# చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా లక్ష్మీనారాయణ

- దండుమల్కాపూర్‌లో నియామక పత్రాల అందజేత
- కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: రాపోలు వీరమోహన్



**తొలివెలుగు, రామన్నపేట:** తెలంగాణా చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా పెండెం లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్ పరిధిలోని శ్రీ అందోల్ మైసమ్మ తల్లి దేవస్థాన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశంలో ఈ నియామకం చేపట్టారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నూతన కార్యదర్శి లక్ష్మీనారాయణకు నియామక ఉత్తర్వులను అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాపోలు వీరమోహన్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనలో నూతన కార్యవర్గం ముందంజలో ఉండాలని సూచించారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఐక్యవేదిక పోరాటాలు సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపోలు రాజశేఖర్, క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బూరుగు వెంకటేశం, కోశాధికారి జెల్ల రఘు పాల్గొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీకి లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

## రామన్నపేట నూతన ఎస్ఐగా సతీష్ గోపాతి బాధ్యతల స్వీకరణ

- శాంతిభద్రతల పరిరక్షణకే ప్రథమ ప్రాధాన్యం
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సతీష్ గోపాతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నల్గొండ సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) లో విధులు నిర్వహించిన ఆయన, బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమేనని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు. ప్రజలకు పూర్తిస్థాయి భద్రత కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. నేరాల నియంత్రణకు వినూత్న చర్యలు చేపడతామని, ముఖ్యంగా యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీస్ శాఖకు ప్రజలు, యువకులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తామని ఎస్ఐ సతీష్ గోపాతి పేర్కొన్నారు.




## బాబూ జగ్జీవన్ రామ్ సేవలు అనన్యం

- రహదారి బంగ్లా వద్ద ఘనంగా వర్ధంతి వేడుకలు
- చిత్రపటానికి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు
- బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**తొలివెలుగు, రామన్నపేట:** భారత మాజీ ఉప ప్రధానమంత్రి, దళితుల మహానేత డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని రహదారి బంగ్లా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ జమీరుద్దీన్ మాట్లాడుతూ.. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నాసర్, బొడ్డు సాలయ్య, మహమ్మద్ అక్రమ్, బండ అంజిరెడ్డి, బొడ్డు శంకరయ్య, మహమ్మద్ రిజ్వాన్, కేశవదాసు, ఉదయ్, మహమ్మద్ లతీఫ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ వేముల వీరేశం నూతన ఛాంబర్ ప్రారంభం

- అసెంబ్లీ ప్రాంగణంలో వేడుకగా నిర్వహణ
- ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని వెల్లడి
- శుభాకాంక్షలు తెలిపిన రామన్నపేట కాంగ్రెస్ నాయకులు



**తొలివెలుగు, రామన్నపేట :** ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో తన నూతన విప్ ఛాంబర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, నకిరేకల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. నూతన విప్ ఛాంబర్ ప్రారంభోత్సవానికి రామన్నపేట ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకటరాజారెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, సింగిరెడ్డి మల్లారెడ్డి, నంద్యాల భిక్షం రెడ్డి, వనం చంద్రశేఖర్, శంభాల వెంకటేష్, కేస కిరణ్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వేముల వీరేశంకు శుభాకాంక్షలు తెలిపారు.

**చరిత్ర తెలుసుకోకుండా, తన పరిమితులేమిటో గ్రహించకుండా ఎడాపెడా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశ సుప్రీంకోర్టు నుంచి మరోసారి చుక్కెదురైంది. అమెరికా గడ్డపై జన్మించినంత మాత్రాన పౌరసత్వం ఇవ్వటం కుదరదంటూ నిరుడు జనవరిలో ట్రంప్ తీసుకొచ్చిన కార్యనిర్వాహక ఉత్తర్వును మంగళవారం కొట్టేస్తూ, 6--3 మెజారిటీతో దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. తన ఉత్తర్వును ట్రంప్ చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అందుకే ఈ కేసు వాద ప్రతివాదాల సమయంలో స్వయంగా హాజరయ్యారు. ఒక అమెరికా అధ్యక్షుడు ఇలా రావటం ఇదే తొలిసారి. తమ తప్పుడు నిర్ణయాలవల్ల దేశంలో అస్తవ్యస్థ స్థితిగతులు ఏర్పడినప్పుడు జనం దృష్టి మళ్లించేందుకు లేదా మిన్ను విరిగి మీద పడే అతి గొప్ప చర్యలు తీసుకుంటున్న అభిప్రాయం వారిలో కలిగించేందుకు ఎక్కడైనా ఇలాగే వ్యవహరిస్తారు. అలాంటివారిలో అగ్రగణ్యుడు ట్రంప్. నిజానికి సుప్రీంకోర్టులో రిపబ్లికన్‌లవైపు మొగ్గుచూపే న్యాయమూర్తుల సంఖ్య అధికంగానే ఉంది.**




# ట్రంప్‌కు మళ్లీ భంగపాటు

కనుకనే అధ్యక్షుడి కార్యనిర్వాహక అధికార పరిధిని దాటుతూ తీసుకుంటున్న పలు నిర్ణయాలకు అనుకూలంగా ఈ రెండేళ్లలోనూ తీర్పులు వెలువడ్డాయి. అయితే అనేక దేశాలపై అధిక సుంకాల విధింపు, ఇప్పుడు జన్మతః పౌరసత్వం అంశాల్లో మాత్రం ఆయన నిర్ణయాలతో సుప్రీంకోర్టు ఏకీభవించలేక పోయింది. ఇది భవిష్యత్తులో అనేకానేక సమస్యలకు దారి తీస్తుందని గ్రహించింది. ట్రంప్ రెండో ఏలుబడి మొదలయ్యాక న్యాయమూర్తులకు పనిభారం బాగా పెరిగింది. అందుకే హేతుబద్ధత లేకుండా, బహిరంగ విచారణైనా జరపకుండా వారు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్న ఉదంతాలున్నాయి. అక్రమ వలసల పేరుచెప్పి జాతి, భాష వంటి కారణాలతో వ్యక్తుల్ని లక్ష్యంగా చేసుకుని భయభ్రాంతులకు గురిచేస్తూ వందలమంది భద్రతా బలగాలు విరుచుకుపడటం, అరెస్టులు చేయటం వగైరాలను సుప్రీంకోర్టు నిర్మొహమాటంగా సమర్థించింది. ఆరోగ్య సంరక్షణ గ్రాంట్లపై కోత విధించటం, జాతి, లింగపరమైన మైనారిటీల విషయంలో తీసుకున్న నిర్ణయాలకూ న్యాయమూర్తులు మద్దతుపలకటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆసియాలో మనతో సహా పలు దేశాల్లోనూ... యూరప్, ఆఫ్రికా ఖండ దేశాల్లోనూ జన్మతః పౌరసత్వం ఇవ్వరు. అయితే అమెరికాలో కొన్ని చారిత్రక కారణాలవల్ల ఇందుకు సంబంధించి రాజ్యాంగంలో ఆర్టికల్ 14 పొందుపరిచారు. అమెరికా వలసవచ్చిన వారి తోనే నిర్మాణమైంది. అంతర్యుద్ధం ముగిసి, బానిసత్వం రద్దుకావటం వంటి పరిణామా లతో 1857లో నల్లజాతీయులు అమెరికా పౌరులు కాలేరంటూ సుప్రీంకోర్టు తీర్పు నిచ్చింది. నల్లజాతీయుల్ని పీల్చిపిప్పిచేసి సంపద పెంచుకున్న అమెరికా ఇంత కృతఘ్న తతో ఉండటాన్ని ప్రశ్నిస్తూ ఆందోళనలు జరిగాక 1868లో ఈ 14వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. నల్లజాతికి చెందిన మాజీ బానిసలు, వారికి పుట్టిన సంతానం దేశ పౌరులే అవుతారని ఈ సవరణ స్పష్టం చేసింది. చైనా వలస కుటుంబానికి ఇది వర్తించబోదని ప్రభుత్వం నిరాకరించినప్పుడు అమెరికాలో జన్మించిన ప్రతి ఒక్కరూ ఇక్కడి పౌరులే అవుతారని 1898లో సుప్రీంకోర్టు తెలియజేసింది. ట్రంప్ ఉత్తర్వు ఏడాదిన్నరగా లక్షలాదిమందిని అనిశ్చితిలో పడేసింది. రెండేళ్ల క్రితం అమెరికా సెన్సెస్ బ్యూరో దేశంలో 52 లక్షలమంది భారతీయులున్నారని చెప్పింది. నిరుడు వెలువడిన లెక్క ప్రకారం హెచ్--1బీ వీసాలున్నవారిలో 71 శాతం మంది భారతీయులే. వీరందరికీ తాజా తీర్పు ఊరటనిస్తుంది. అయితే గ్రీన్‌కార్డుకు దరఖాస్తుచేసి ఎదురుచూస్తున్నవారికి ఈ తీర్పువల్ల ఉపశమనం దొరకదు. అక్కడ జన్మించినవారి పిల్లలు దేశ పౌరులుగా మారినా, తల్లిదండ్రులకు ఎదురుచూపులు తప్పవు. తమ వీసా దరఖాస్తుల్లో అబద్ధం చెప్పి దేశంలో ప్రవేశించినవారి ఆచూకీ తెలుసుకోవటం, వారిపై ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించటం తమ ప్రాధాన్యతంటూ అమెరికా న్యాయశాఖ చెప్పటం సహజంగానే గుబులు రేపుతోంది. తీర్పు వెలువడ్డాక కూడా కొత్తగా చట్టం తీసుకొస్తానంటూ ట్రంప్ చెప్పటం ఆయన మొండివైఖరికి నిదర్శనం. ఇప్పటికైనా వివేకంతో మెలగటం, అసలైన సమస్యలపై దృష్టిసారించటం అవసరమని ఆయన గ్రహించాలి.

# సంస్థాన్ నారాయణపురం ఎస్ఐగా సీత పాండు బాధ్యతల స్వీకరణ

- బాధితుల ఫిర్యాదులపై సత్వర న్యాయం అందిస్తాం
- చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవు




**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం పోలీస్ స్టేషన్ నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా సీత పాండు సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయంలో బాధ్యతల రికార్డులపై సంతకం చేసి విలేకరులతో మాట్లాడారు. చట్టం ముందు అందరూ సమానమేనని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వర న్యాయం అందేలా పారదర్శకంగా విధులు నిర్వహిస్తామని ఎస్ఐ పేర్కొన్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, స్థానిక ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ 'ప్రజా పోలీసింగ్' విధానానికి ప్రాధాన్యం ఇస్తామని, ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని సూచించారు. మండల పరిధిలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగినా సహించేది లేదని, అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సీత పాండును పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

**తెలంగాణ రాష్ట్రంలో ఒక విచిత్రమైన రాజకీయ పరిస్థితి నెలకొంది. వాస్తవానికి అధికారపక్షం వర్సెస్ ప్రతిపక్షం అన్నట్టుగా రాజకీయాలు సాగుతాయి. కానీ, తెలంగాణ రాష్ట్రంలో స్వపక్షంలోనే విపక్షం ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దీనికి తోడు నేతలు ఎవరికి వారుగా మీడియాకు లీకులు ఇస్తున్న నేపథ్యంలో.. ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పది సంవత్సరాలపాటు అధికారంలో భారత రాష్ట్ర సమితి ఉంది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు.**

సహజంగానే కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం అధికంగా ఉంటుంది. అందువల్ల నేతలు ఎవరికి వారు అన్నట్టుగా మాట్లాడుతుంటారు. హై కమాండ్ కూడా ఈ తరహా నేతల విషయంలో చూసీచూడనట్టు వ్యవహరిస్తూ ఉంటుంది. చర్యలు తీసుకునే విషయంలో కాస్త వెనకా ముందు ఆలోచిస్తూ ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ అలా చేయడం వల్లే పరిస్థితి ఇప్పుడు ఇక్కడ దాకా వచ్చింది.రేవంత్ రెడ్డి



# అంతకంతకు పెరుగుతున్న గ్యాప్

మధ్య, మిగతా మంత్రుల మధ్య గ్యాప్ ఉందని ప్రచారం జరుగుతుంది. అంతకుముందు కొండ సురేఖ, ఇటీవల కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్క.. వంటి మంత్రులతో రేవంత్ రెడ్డికి గ్యాప్ వచ్చిందని ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా గులాబీ పార్టీ మీడియా, సోషల్ మీడియా ఈ వ్యవహారాలను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. ఇవి ఎంతవరకు వెళ్లాయంటే.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా భట్టి పావులు కదుపుతున్నారనే ప్రచారం దాకా చేరుకున్నాయి. అయితే వీటిని ఖండించాల్సిన నేతలు వినోదం చూస్తుండడంతో.. ఇదంతా నిజమేనని చాలామంది వ్యాఖ్యానిస్తున్నారు.వాస్తవానికి ఇటీవల నైనీ కోల్ వ్యవహారం తెరపైకి వచ్చిన తర్వాత అందరి దృష్టి భట్టివిక్రమార్క మీద కేంద్రీకృతమైంది. దీనికి ప్రధాన కారణం ఆంధ్రజ్యోతి పత్రిక అధిపతి వేమూరి రాధాకృష్ణ రాసిన కొత్త పలుకు. రాధాకృష్ణ ఆ స్థాయిలో రాయడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు భట్టి విక్రమార్కతో కలిసి ఎన్టీవీ చైర్మన్ నరేంద్ర చౌదరి వ్యాపార సాగిస్తున్నారని ఆరోపణలు కూడా వినిపించాయి. ఇవన్నీ కూడా రేవంత్ రెడ్డి వల్ల జరుగుతున్నాయని గులాబీ పార్టీ మీడియా ఆరోపించడం మొదలుపెట్టింది. దీంతో తెరపైకి భట్టి రావాల్సి వచ్చింది. కాకపోతే ఆయన స్వీట్ వార్నింగ్ స్థాయిలో మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు. వాస్తవానికి జనాలలో, సమాజంలో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. అయితే వీటిని ఖండించాల్సిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీ పెద్దలు మౌనాన్ని ఆశ్రయించడం అనేక అనుమానాలకు కారణమవుతోంది.ఇటీవల భట్టి మాట్లాడినప్పుడు ముఖ్యమంత్రికి తనకు మధ్య సానుకూల వాతావరణం ఉంది అన్నట్టుగా వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రిని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి కూడా వివిధ వేదికలలో మంత్రులకు అనుకూలంగా మాట్లాడారు. తమ ప్రభుత్వంపై ఏవైనా వ్యతిరేక కథనాలు రాయాలి అనుకుంటే తన వివరణ తీసుకోవాలని ముఖ్యమంత్రి ఇటీవల వ్యాఖ్యానించడం కొసమెరుపు. ఏది ఏమైనప్పటికీ మంత్రులతో రేవంత్ రెడ్డికి గ్యాప్ ఉందని గులాబీ పార్టీ మీడియా, గులాబీ నాయకులు అంటుంటే.. అదంతా ఉట్టి ప్రచారమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టి పారేస్తున్నారు. కానీ ఈ గ్యాప్ లో మిగతా వారికి కావాల్సిన వినోదం.. అంతకుమించి అనే స్థాయిలో మసాలా లభిస్తోంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో మంత్రుల భేటీపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. లోక్ భవన్ నుంచి అందరి ముందే తామంతా ఒకే కారులో వెళ్లామని, అలా బహిరంగంగా వెళ్లినప్పుడు అది రహస్య భేటీ ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల భేటీకి రాజకీయ రంగులు పులుముతూ విష ప్రచారం చేయడం సరికాదని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు.మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన పార్టీ వ్యూహాలపై చర్చించడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సన్నద్ధత అనేది రాజకీయ పార్టీల ప్రాథమిక బాధ్యత అని, దీనిపై చర్చించుకోవడాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కొందరు కావాలనే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.పాలనలో సమన్వయం కోసమే తాము సమావేశమయ్యామని, క్యాబినెట్ అనేది ఒక యూనిట్ లాంటిదని మంత్రి వివరించారు. పాలనాపరమైన అంశాల్లో ఎక్కడా జాప్యం జరగకుండా చూడటం సీనియర్ మంత్రులుగా తమ బాధ్యత అని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క నివాసంలో జరిగిన చర్చలన్నీ కేవలం ప్రభుత్వం మరియు పార్టీ సమష్టి బాధ్యతలో భాగమేనని, ఇందులో దాపరికాలు ఏమీ లేవని ఆయన తేల్చి చెప్పారు.నిర్మాణాత్మకమైన విమర్శలను తాము ఎప్పుడూ స్వాగతిస్తామని, అయితే కేవలం ఊహాజనిత కథనాలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని శ్రీధర్ బాబు హెచ్చరించారు. భావితరాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని అడ్డుకోకుండా, ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన

ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలు.. మీడియా రాస్తున్న కథనాలు ఘాటుగా ఉంటే.. వాటికి కాంగ్రెస్ నేతలు ఇస్తున్న బదులు మామూలుగా ఉంటున్నది. అందువల్లే

ప్రభుత్వాలు నడుపుతున్న వ్యక్తులకు , పార్టీలకు జవాబుదారీతనం లేకుండా పోయింది. సవాళ్లు, ప్రతిసవాళ్ల తో సమస్యలను పక్కదారి పట్టించేస్తున్నారు. ప్రధానంగా ఇది తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. సమస్యలను, అవినీతిపై పరస్పర విమర్శలు చేసుకుంటూ ఇది వారి వ్యక్తిగత వ్యవహారంగా ప్రచారం చేసుకునే రీతిలో ప్రవర్తిస్తున్నారు. ఎపిలో టిడిపి, వైసిపి, తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పరిస్థితి ఇలాగే ఉంది. పరస్పర విమర్శలతో ప్రజలను మభ్య పెటట్డం ద్వారా ఈ పార్టీలు పబ్బం గడుపుకునే పరిస్థితి దాపురించింది. నిజానికి ఈ వ్యవహారంపై అంటే అవినీతి ఆరోపణలపై కేంద్రం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై రెండేళ్లు దాటినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. విచారణల తోనే కాలం గడిచింది. కేంద్ర ప్రభుత్వ టెలిగ్రాఫిక్ చట్టం ప్రకారం ఫోన్ ట్యాపింగ్ తీవ్ర నేరంగా పరిగణించాలి. బిఆర్ఎస్ పాలనా కాలంలో చాలా మంది ఫోన్ సంభాషణలను రికార్డు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వ్యక్తిగత గోప్యతను హరించివేశారు. వాటి ఆధారాలను తుడిచిపెట్టారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు తాము కూడా బాధితులమే అని చెప్పుకొంటున్నారంటే ఏ స్థాయిలో అంటున్నారు. విచారణ ఎంత ఎక్కువ కాలం సాగితేస్తే అంతగా లబ్ది పొందాలని ప్రభుత్వం చూస్తున్నదా అన్నది కూడా తెలియాల్సి ఉంది. ఇదే అదనుగా ట్యాపింగ్ విచారణకు హాజరైన హరీశ్‌రావు, కేటీఆర్‌లు ప్రభుత్వంపై తీసుకోవడానికి ఎంతో సమయం పట్టదు. అది సింగరేణి విషయమైనా, టెలిఫోన్ ట్యాపింగ్ విషయమైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. ప్రభుత్వాలు బలంగా కోరుకున్న సందర్భాలలో విచారణలు వేగంగా పూర్తవుతాయి. శిక్షలు కూడా అంతే



# విచారణలో కాలయాపనలు దేనికోసం ?

టెలిఫోన్ ట్యాపింగ్ దుర్వినియోగమయిందో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు కవిత పదేపదే ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుత దర్యాప్తుతో సత్వర న్యాయం కాదుకదా, అసలు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని అంటున్నారు. ప్రతిపక్షాలతోపాటు జర్నలిస్టులు, ఇతర ప్రముఖుల సంభాషణలు విని వారి కదలికలను తెలుసుకోవడం ద్వారా కేసీఆర్ వారిని కట్టడికి యత్నించారు. అధికారాన్ని కూడా నిలుపుకోవడానికి ఈ నీచయత్నానికి పాల్పడ్డారు. ఎలక్టోరల్ బాండ్స్ పొందడం కోసం టెలిఫోన్ ట్యాపింగ్‌ను సాధనంగా వాడుకున్నట్లు బయటపడింది. కెటిఆర్ విచారణలో ఇదే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. ఈ వ్యవహారంపై రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఇంకెంత కాలం విచారణ జరుపుతారన్నది తెలియదు. సుప్రీంకోర్టు కూడా ఇటీవల ఒక సందర్భంలో ఇంకెంతకాలం అన్న విసయాన్ని ప్రస్తావించింది. టెలిఫోన్ ట్యాపింగ్‌పై అవసరమైన ఆధారాలు ఇప్పటికే ప్రభుత్వానికి లభించాయి. కావాలనుకుంటే ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోవచ్చు. అయినా విచారణను సాగదీస్తున్నారు. బహుశా కేసీఆర్, సంతోష్‌రావును కూడా త్వరలో విచారణకు పిలవవచ్చని ఎదురుదాడి మొదలెట్టారు. వేధింపుల కోసం, ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఈ విచారణలను కనసాగిస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే వీలైనంత త్వరగా ముగించడం, దోషులును శిక్షలకు గురి చేయడం అవసరం. గతంలో జరిగిన తప్పులపై చర్యలు తీసుకొనే విధంగా విచారణ సాగాలి. త్వరగా ముగించాలి. అలాకాకపోతే ఇదంతా అధికార విపక్షాల మధ్య నడిచే డ్రామాగా పరిగణించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికే విమర్శలు చేయడం మొదలెట్టారు. అతీగతీ లేకుండా విచారణలు సాగుతూ ముఖ్య నాయకులను విచారణల పేరిట పిలుస్తూ పోవడంవల్ల ప్రజలు సహజంగానే వారి విమర్శలను విశ్వసిస్తారు. టెలిఫోన్ ట్యాపింగ్ విచారణ సాగినంత కాలం బీఆర్ఎస్ నాయకులు సింగరేణి వంటి విషయాల్లో ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూనే ఉంటారు. ప్రస్తుతానికి టెలిఫోన్ ట్యాపింగ్ విషయమే హాట్ టాపిక్ అయింది. త్వరలో మరో వివాదం తెరపైకి రావొచ్చు. అప్పుడు ఇది కూడా తెర మరుగవుతుంది. ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తప్పు చేసిన వారిపై చర్యలు వేగంగా పడతాయి. రాజకీయ క్రీడలో భాగమైనప్పుడు మాత్రమే విచారణలు సాగుతూనే ఉంటాయి. ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతూనే ఉంటాయి. ఎదురుదాడి వ్యూహాలు పదునెక్కుతాయి. ఇక సింగరేణిపై అటు కేంద్రం.. ఇటు రాష్ట్ర ప్రభుత్వం విషం చిమ్ముతున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని నిబంధనలు పెడుతూ ఆ సంస్థను నిర్వీర్యం చేయడంతో పాటు ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే రెండు బొగ్గు గనులను కేంద్రం వేలం ద్వారా అమ్మి ప్రైవేట్‌కు ద్వారాలు తెరువగా.. ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా అదేబాటలో నడుస్తున్నది. ఓవర్ బర్డెన్ పనులకు 'సైట్ విజిట్' నిబంధనను ముందుగా తెచ్చి, ఆ తర్వాత నైని బొగ్గు బ్లాక్‌లో ఏకంగా బొగ్గు ఉత్పత్తి ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు భట్టి తదితరలుఉ రంగంలోకి దిగారని అంటున్నారు. సింగరేణి చేతిలో ఉండాల్సిన ఈ గనిని 25 ఏండ్ల పాటు ప్రైవేట్ కంపెనీల చేతుల్లో పెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. అంటే పేరు మాత్రమే సింగరేణిది, గనిపై పూర్తి అధికారాలు ప్రైవేట్ సంస్థకే ఉంటాయని అర్థం చేసుకోవాలి.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




# ఇలాంటి యాక్షన్ రాలేదు!

'అందరూ 'టాక్సిక్' రిలీజ్ ఇన్నిసార్లు ఎందుకు వాయిదా పడిందనే విషయం గురించి మాట్లాడుతున్నారు. కానీ సినిమా కంటెంట్ ఎంత కొత్తగా ఉందో ఆలోచించడం లేదు. ఇలాంటి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తాయి' అని చెప్పింది కథానాయిక హ్యూమా ఖురేషి. యశ్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' సినిమాలో ఆమె ఓ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్ట్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు రిలీజ్ డేట్‌ను కన్‌ఫర్మ్ చేసుకుంది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో హ్యూమా ఖురేషి సినిమా విశేషాలను పంచుకుంది. ఈ చిత్రంలోని కొన్ని భాగాలను మాత్రమే తాను చూశానని, భారతీయ సినిమాలో ఈ స్థాయిలో యాక్షన్‌ను ఇప్పటివరకూ చూడలేదని ఆమె చెప్పింది. 'ఇలాంటి సినిమాలు ఎప్పుడు రిలీజైనా సంచలనం సృష్టించడం ఖాయం. కంటెంట్‌తో పాటు మేకింగ్, యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకుల్ని అబ్బురపరుస్తాయి. కథలోని పాయింట్ కూడా ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది' అని హ్యూమా ఖురేషి తెలిపింది. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా వివిధ భారతీయ భాషల్లో భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్నది.



# ఉవ్వెత్తున ఎగిసే ఉత్తుంగ తరంగం

అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. సోమవారం ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'అణువు అణువును ఉర్రూతలూపే ప్రణయ కల్లోలమే-రోమాంచకం, ఊహకే అందని ఉవ్వెత్తునెగిసే ఉత్తుంగ తరంగమే రోమాంచకం' అంటూ మెలోడియస్ ట్యూన్‌తో ఈ గ్లింప్స్ ఆకట్టుకునేలా ఉంది. వాసుకి వైభవ్ మ్యూజిక్, విజువల్స్ ఈ గ్లింప్స్‌లో ప్రధానాకర్షణగా నిలిచాయి. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలబోసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వాసుకి వైభవ్, రచన-దర్శకత్వం: వేణుగోపాల్ రెడ్డి.



# 'పెద్ది' నుంచి 'సింగ్ గీతం' వరకు..
# ఈ వారం ఓటీటీలో బ్లాక్‌బస్టర్ ఎంటర్‌టైన్‌మెంట్!

ఈ వారం సినీ ప్రేక్షకులకు డబుల్ ట్రీట్ సిద్ధమైంది. ఒకవైపు థియేటర్లలో అఖిల్ అక్కినేని నటించిన రూరల్ మాస్ ఎంటర్‌టైనర్ లెనిన్ తో పాటు మలయాళ డబ్బింగ్ మూవీ 'ఐ నోబడీ', మైథలాజికల్ ఎపిక్ 'వసుదేవసుతం', తమిళ డబ్బింగ్ లవ్ స్టోరీ 'లవ్ ఓ లవ్' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుండగా... మరోవైపు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో కూడా భారీ సినిమాలు, ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్‌లు స్ట్రీమింగ్‌కు రానున్నాయి. ముఖ్యంగా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'పెద్ది' డిజిటల్ ప్రీమియర్ ఈ వారంలోనే ఉండటంతో ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ఈ ఏడాది అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌లలో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు ఈ చిత్రం జులై 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. భారతీయ సినీ చరిత్రలో ఎన్నో క్లాసిక్ చిత్రాలను అందించిన లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు 94 ఏళ్ల వయసులో తెరకెక్కించిన చిత్రం సింగ్ గీతం. ఈ సినిమా కూడా జులై 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులోకి రానుంది. తమిళంలో విడుదలై ప్రశంసలు అందుకున్న డార్క్ కామెడీ థ్రిల్లర్ 'పరిమళ అండ్ కో' కూడా ఈ వారమే ఓటీటీలోకి అడుగుపెడుతోంది. పాండిరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జయరాం, ఊర్వశి, అనంతిక సానిల్ కుమార్, యోగిబాబు ప్రధాన పాత్రలు పోషించారు. జులై 10 నుంచి జీ5లో తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. సన్నీ డియోల్, అక్షయ్ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన కోర్ట్‌రూమ్ డ్రామా 'ఇక్కా' కూడా ఈ వారం ప్రేక్షకుల ముందుకు రానుంది. సిద్ధార్థ్ పి మల్హోత్రా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దియా మీర్జా, సంజీదా షేక్, ఆకాంక్ష రంజన్ కపూర్ కీలక పాత్రల్లో నటించారు. జులై 10 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది.









# వెంకీ అట్లూరి దర్శకత్వంలో?

అగ్ర కథానాయకుడు నాని ప్రస్తుతం 'ది ప్యారడైజ్' షూట్‌లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా షూటింగ్ ఆలస్యం కావడంతో నానితో సినిమా చేయాలనుకున్న దర్శకులంతా వేరే హీరోల బాట పడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'బ్లడీ రోమియో' కథను నానితో తీసేందుకు సిద్ధంగా ఉన్న సుజీత్ సైతం 'ది ప్యారడైజ్' లేట్ కారణంగానే 'ఓజీ 2'ను లైన్‌లో పెట్టే పనిలో పడ్డారని ఇన్‌సైడ్ టాక్. ఇదిలావుంటే.. నాని తాజాగా దర్శకుడు వెంకీ అట్లూరి కథకు ఓకే చెప్పారు. వీరిద్దరి మధ్య చాలాకాలంగా కథా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఎట్టకేలకు వెంకీ రీసెంట్‌గా చెప్పిన కథ నానిని బాగా ఆకట్టుకున్నదట. దాంతో ఆయన పచ్చజెండా ఊపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమా నిర్మిస్తారట. అందరూ అనుకుంటున్నట్టు దర్శకుడు సుజీత్ 'బ్లడీ రోమియో' కథను పక్కన పెట్టి 'ఓజీ 2'ను లైన్లోకి తెస్తే, 'ది ప్యారడైజ్' తర్వాత నాని చేసే సినిమా వెంకీ అట్లూరిదే అవుతుంది. ఒకవేళ సుజీత్ 'బ్లడీ రోమియో' సినిమానే ముందుకు తెస్తే, ఆ సినిమా పూర్తయ్యాక వెంకీ అట్లూరి సినిమా ఉంటుంది. ఏదేమైనా నాని లైనప్‌లో సరైన సినిమా వచ్చి చేరింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది.

